# మళ్లీ నాలుక మడతేసిన కాంగ్రెస్

- **సన్న వడ్లకే బోనస్సు ఇస్తామని ఎక్కడా అన్లేదు**
- **నిన్న మహేశ్‌కుమార్... నేడు కోదండరెడ్డి బుకాయింపు**

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): అధికార కాంగ్రెస్ పార్టీకి నాలుక మడతేయడం అలవాటుగా మారింది. సన్న వడ్లు పండించే రైతులకే బోనస్సు ఇస్తామని సీఎం అనని మాట అన్నట్టుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని నిన్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ అంటే, తాజాగా కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి కూడా ఇదే మాట అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ. 2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని, ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ప్రకటించడం తెలిసిందే. డిసెంబర్‌లో అధికారాన్ని చేపట్టిన సమయంలో ధాన్యానికి బోనస్ ఎప్పుడిస్తారని ప్రశ్నించగా.. 'ఇప్పుడే కదా వచ్చింది.. యాసంగి సీజన్‌కు ఇస్తాం' అని ప్రభుత్వ పెద్దలు చెప్పారు. ఏప్రిల్‌లో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనప్పటికీ బోనస్ అంశాన్ని మాత్రం మంత్రులెవరూ ప్రస్తావించలేదు. ఏప్రిల్ ఒకటోతేదీ నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామని పౌరసరఫరాల సంస్థ, అటు ప్రభుత్వం ప్రకటించాయి తప్ప బోనస్‌పై మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఇక ఆ అంశాన్ని పూర్తిగా మరిచిపోయారు. తాజాగా ఎన్నికలు ముగిసిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి పాత్రికేయులతో చిట్‌చాట్ చేస్తూ కేవలం సన్న వడ్లు పండించే రైతులకు మాత్రమే రూ.500 బోనస్సు ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ విషయం దాదాపు అన్ని పత్రికలలో వచ్చింది. దీనిపై రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం కాగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. అయినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోగా.. కనీసం వివరణ కూడా ఇవ్వలేదు. కానీ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో కొందరు నేతలు సీఎంను వెనకేసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ముందుగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెండ్ మహేశ్ కుమార్‌గౌడ్ సీఎం అనని మాటలను అన్నట్టు ప్రతిపక్ష పార్టీ తమ ప్రభుత్వాన్ని బద్నామ్ చేస్తున్నదని ఆరోపించారు. మరోవైపు కాంగ్రెస్ కిసాన్ సెల్ నేతలు కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డి సైతం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని సీఎం ఎక్కడా అన్లేదని చెప్పుకొచ్చారు.



నిజామాబాద్ జిల్లా బోధన్ శివారులో చెట్టు నీడలో సేద తీరుతున్న పశువులు

# ధాన్యం తరుగు పేరిట మాఫియా

- **బస్తాకు రెండుచోట్ల ఏడు కిలోల తరుగు**
- **బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఫైర్**



హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ధాన్యం తరుగు పేరిట మాఫియా రైతులను పీల్చుకుతింటున్నదని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తాలు, తేమ పేరుతో బస్తాకు 4 కిలోల చొప్పున తరుగు తీస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని విమర్శించారు. కాంటా చేసిన ధాన్యానికి రసీదు ఇవ్వకపోగా, మిల్లులకు తరలించిన ధాన్యానికీ రైస్ మిల్లర్లు 3 కిలోల చొప్పున తరుగు తీస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఈ మాఫియాను నడిపిస్తున్నది ఎవరని ఆయన ప్రశ్నించారు. రైతుల సమస్యలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నానా రకాలుగా మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని కల్లాల్లో పోసి 45 రోజులుగా ఎదురుచూస్తున్నా.. ప్రంభుత్వం కొనుగోలు చేయడం లేదని ధ్వజమెత్తారు. రాత్రింబవళ్లు ధాన్యం కుప్పల వద్ద రైతులు కాపలా కాస్తూ అనేక అవస్థలు పడుతున్నారని, అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కొందరు రైతులు పిడుగుపాటుతో మరణించిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న రకం ధాన్యానికే బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం బోగస్ మాటలు చెప్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలోని రైతాంగ సమస్యలను పరిష్కరించే వరకు, కాంగ్రెస్ తన హామీలను నెరవేర్చేదాకా బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

# వడ్లు ఇక్కడ..మంత్రి ఎక్కడ?

మొదటిపేజీ తరువాయి...

సేకరణ కోసం ఆర్భాటంగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 7,151 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. నెలన్నర గడుస్తున్నప్పటికీ కేంద్రాల్లో 2,241 చోట్ల ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియనే ప్రారంభం కాలేదని తెలుస్తున్నది. ఇప్పటివరకు 27 లక్షల టన్నులు మాత్రమే.. అంటే దాదాపు సగానికి తక్కువనే కొనుగోలు చేశారని అధికారిక గణాంకాలే వెల్లడిస్తున్నాయి. నిరుడు ఇదే సమయానికి దాదాపు కొనుగోళ్ల ప్రక్రియ మొత్తం పూర్తయింది. కానీ, ఇప్పుడు ధాన్యం కొనుగోలు, రవాణా ఇలా అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతున్నది. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ రోజుల తరబడి కొనసాగుతుండటంతో రైతన్నలు కల్లాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. అనేక చోట్ల వర్షాలతో కల్లాల్లోని ధాన్యం తడిసిముద్దయితున్నది. ధాన్యాన్ని ఆరబెట్టడం, మళ్లీ తడిసిపోవడంతో రైతన్నలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

**పత్తాలేని అమాత్యుడు ఉత్తమ్..**

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నేతృత్వంలోనే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతున్నది. కొనుగోళ్లు మందకొడిగా సాగకుండా ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ చేయాల్సిన ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పత్తా లేకుండా పోయారు. క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటన్నింటిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పరిష్కార మార్గాలను సూచిస్తూ, అధికారులను ముందుకు నడిపిస్తూ, కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా పూర్తయ్యేలా చూడాల్సిన మంత్రి ఇప్పటివరకు ఒక్క సమీక్ష పెట్టిన దాఖలా లేకపోవడం గమనార్హం. సివిల్ సప్లయ్ కార్పొరేషన్ అప్పులపై గతంలో హడావుడిగా సమీక్షలు పెట్టిన మంత్రి కొనుగోళ్లు ప్రారంభమై 45 రోజులు గడుస్తున్నా ఒక్కసారి కూడా ఆ దిశగా చూసింది లేదు. వ్యవసాయశాఖ మంత్రి సమీక్షలు నిర్వహిస్తున్నా, సీఎం సైతం ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో చర్చిస్తున్నా కూడా పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ మాత్రం ధాన్యం కొనుగోళ్ల ఊసెత్తకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో మంత్రి ఉన్నారా? లేరా? అన్న సందేహాలు వెలువడుతున్నాయి.

# హరితహారం చెట్లపై వేటు!

*బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారి నీడను, చల్లదనాన్ని, ఫలాలనందిస్తున్నాయి. కాగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పచ్చదనం పెంచాలని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా సాగుతున్నది. ఎక్కడికక్కడ చెట్లను నరుకుతూ మళ్లీ మొక్కలు నాటేందుకు సిద్ధమవుతుండడంపై జనం మండిపడుతున్నది. గతంలో నాటిన మొక్కలను కూడా సంరక్షిస్తే బాగుంటుందని కోరుతున్నది.*



పెద్దపల్లి జిల్లా ముత్తారంలో విద్యుత్ అధికారులు కొట్టేయించిన వృక్షాలు

# పచ్చదనం వైపు అడుగులేద్దాం

- **జల సంరక్షణ అందరి బాధ్యత**
- **మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు**




ఐజీబీసీ ప్రతినిధులతో కలిసి హాజరైన మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 17 (నమస్తే తెలంగాణ)/మాదాపూర్: పచ్చదనం పెంపుకోసం, జల సంరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో జరుగుతున్న ఐజీబీసీ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్ ప్రాపర్టీ షో-2024కు మంత్రులు ముఖ్యఅతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో హైదరాబాద్ దూసుకుపోతున్నదని తెలిపారు. మెట్రో రైలును మరింత విస్తరించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకొంటామని వెల్లడించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి ఒకరు పచ్చదనం వైపు నడవాలనే మంచి ఉద్దేశంతో ఐజీబీసీ పనిచేస్తున్నదని తెలిపారు. ఐజీబీసీ చేస్తున్న కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం ఇంకుడు గుంతల నిర్మాణం కోసం జలమండలి రూపొందించిన బ్రోచర్‌ను మంత్రులు పరిశీలించారు. కార్యక్రమంలో ఐజీబీసీ చైర్మన్ సీ శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, జలమండలి ఇంకుడు గుంతల ప్రత్యేకాధికారి జాల సత్యనారాయణ, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మిగిలిన ధాన్యాన్ని త్వరగా సేకరించండి

- **రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోండి**
- **12లోగా ఆదర్శ పాఠశాల పనులు పూర్తవ్వాలి**
- **వీసీలో సీఎస్ శాంతికుమారి**



హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): కల్లాల్లో, ఇండ్ల వద్ద మిగిలిన ధాన్యాన్ని సేకరించేలా వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వేగంగా ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి కొందరు కలెక్టర్లు తీసుకున్న చర్యలను సీఎస్ అభినందించారు. ఇదే విధానాన్ని మిగతా కలెక్టర్లు అనుకరించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై శుక్రవారం సచివాలయం నుంచి కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని పూర్తిచేసిన కలెక్టర్లను అభినందించారు. జూన్ 12లోగా ప్రతి విద్యార్థికి నోట్‌బుక్‌లు, పాఠ్య పుస్తకాలు, ఒక జత స్కూల్ యూనిఫాం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మరమ్మతులు, విద్యుద్దీకరణ, మరుగుదొడ్లు, తాగునీరు, పెయింటింగ్, ఫర్నీచర్ పనులు చేపట్టాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బీ వెంకటేశం, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్, పౌర సరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, మున్సిపల్‌శాఖ డైరెక్టర్ దివ్య, పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ పాల్గొన్నారు.


